"మురళి సారము"

09-03-26 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

**"మధురమైన పిల్లలూ - ఏ విధముగా సర్వుల కళ్యాణము చేయడమనేది బాబా పాత్రనో, అలా బాబా సమానముగా కళ్యాణకారులుగా అవ్వండి, తమ కళ్యాణాన్ని మరియు సర్వుల కళ్యాణాన్ని చేయండి "**

**ప్రశ్న:-** పిల్లల్లోని ఏ ఒక్క విశేషతను చూసి బాప్‌దాదా చాలా సంతోషిస్తారు?

**జవాబు:-** పేద పిల్లలు బాబా యజ్ఞానికి 8 అణాలను, ఒక రూపాయిని పంపిస్తారు. బాబా, దీనికి బదులుగా మాకు మహళ్ళు ఇవ్వండి అని అంటారు. బాబా అంటారు, పిల్లలూ, ఈ ఒక్క రూపాయి కూడా శివబాబా ఖజానాలో జమ అయిపోయింది, మీకు 21 జన్మల కోసం మహళ్ళు లభిస్తాయి. సుదాముని ఉదాహరణ ఉంది కదా. పైసా ఖర్చు లేకుండా పిల్లలైన మీకు విశ్వ రాజ్యాధికారము లభిస్తుంది. బాబా పేద పిల్లల్లోని ఈ విశేషతను చూసి చాలా సంతోషిస్తారు.

**పాట:- మిమ్మల్ని పొంది మేము...**

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. సదా అపారమైన సంతోషములో ఉండేందుకు అనంతమైన జ్ఞానాన్ని బుద్ధిలో ఉంచుకోవాలి. జ్ఞాన రత్నాలతో మీ ఒడిని నింపుకుని మీ కళ్యాణాన్ని మరియు సర్వుల కళ్యాణాన్ని చేయాలి. జ్ఞానములో చాలా-చాలా చురుకుగా అవ్వాలి.
2. భవిష్య 21 జన్మల రాజ్యభాగ్యము యొక్క అధికారాన్ని తీసుకునేందుకు తమ బ్యాగ్-బ్యాగేజ్ అంతటినీ ట్రాన్స్ఫర్ చేసుకోవాలి. ఈ ఛీ-ఛీ ప్రపంచము నుండి విముక్తులయ్యేందుకు యుక్తులను రచించాలి.

**వరదానము:- ఒక్క తండ్రి ప్రేమలో లవలీనమై ఉంటూ సదా ఎక్కే కళను అనుభవము చేసే సఫలతామూర్త భవ**

సేవలో మరియు స్వయము యొక్క ఎక్కే కళలో సఫలతకు ముఖ్య ఆధారము - ఒక్క తండ్రి పట్ల ఎడతెగని ప్రేమ. తండ్రి తప్ప ఇంకేమీ కనిపించకూడదు. సంకల్పాలలో కూడా బాబా, మాటలలో కూడా బాబా, కర్మలలో కూడా బాబా తోడు. ఇటువంటి లవలీన ఆత్మ ఒక్క మాట మాట్లాడినా కూడా వారి స్నేహపూర్వకమైన మాట ఇతర ఆత్మలను కూడా స్నేహములో బంధించివేస్తుంది. ఇటువంటి లవలీన ఆత్మ నుండి వచ్చే 'ఒక్క బాబా' అన్న మాటయే ఇంద్రజాలములా పని చేస్తుంది. వారు ఆత్మిక ఇంద్రజాలికులుగా అయిపోతారు.

**స్లోగన్:- ఎవరైతే అంతర్ముఖులుగా అయ్యి లైట్-మైట్ రూపములో స్థితులై ఉంటారో వారే యోగీ ఆత్మలు.**

**<u>అవ్యక్త ప్రేరణలు</u>**

**నిశ్చయమనే పునాదిని దృఢముగా చేసుకుని సదా నిర్భయులుగా, నిశ్చింతగా ఉండండి**

మీకు ఏ డ్యూటీ లభించినా కానీ అందులో సదా ఏక్యురేట్‌గా ఉండండి. ఎవరైతే డ్యూటీలో ఏక్యురేట్‌గా ఉంటారో, వారిని అందరూ నిజాయితీపరులు, విశ్వాసపాత్రులు అన్న దృష్టితో చూస్తారు. ఇక్కడ కూడా ఎవరైతే ఏక్యురేట్‌గా సేవలో ఉంటారో, వారే బాబాకు విశ్వాసపాత్రులు. ఒకటేమో బాబాపై పూర్తి విశ్వాసము ఉండటము, మరొకటి బాబాపై విశ్వాసము ఉండటముతోపాటు సేవలో కూడా విశ్వాసపాత్రులుగా ఉండటము. ఇటువంటి విశ్వాసపాత్రులైన నిశ్చయబుద్ధి కల పిల్లలు సదా విజయులుగా మరియు నిశ్చింతగా ఉంటారు.

10-03-26 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

**"మధురమైన పిల్లలూ - అన్నింటికన్నా పెద్ద వ్యాధి దేహాభిమానము, దీని ద్వారానే పతనము జరిగింది, అందుకే ఇప్పుడు దేహీ-అభిమానులుగా అవ్వండి"**

**ప్రశ్న:-** పిల్లలైన మీ యొక్క కర్మాతీత అవస్థ ఎప్పుడు ఏర్పడుతుంది?

**జవాబు:-** యోగబలముతో కర్మభోగముపై విజయము ప్రాప్తి చేసుకున్నప్పుడు, పూర్తి దేహీ-అభిమానులుగా అయినప్పుడు కర్మాతీత అవస్థ ఏర్పడుతుంది. ఈ దేహాభిమానమన్న వ్యాధియే అన్నింటికన్నా పెద్దది, దీనితో ప్రపంచము పతితముగా అయ్యింది. దేహీ-అభిమానులుగా అయినట్లయితే ఆ సంతోషము, ఆ నషా ఉంటుంది, నడవడిక కూడా బాగవుతుంది.

**పాట:- రాత్రి ప్రయాణీకుడా అలసిపోకు...**

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. దేహాభిమానములోకి వచ్చి ఎటువంటి తప్పుడు పనులను చేయకూడదు. దేహీ-అభిమానులుగా అయ్యేందుకు పూర్తి పురుషార్థము చేయాలి. తమ గుణాన్ని, స్వభావాన్ని (నడవడికను) సరిదిద్దుకుంటూ ఉండాలి.
2. చాలా-చాలా మధురముగా, శీతలముగా అవ్వాలి. లోలోపల క్రోధము, మోహమనే భూతాలేవైతే ఉన్నాయో, వాటిని తొలగించివేయాలి.

**వరదానము:- గౌరవము ఇచ్చే రికార్డును మంచిగా ఉంచుకుంటూ, సంతోషమనే మహాదానాన్ని ఇచ్చే పుణ్య ఆత్మా భవ**

వర్తమాన సమయములో నలువైపులా గౌరవాన్ని ఇచ్చే రికార్డును మంచిగా ఉంచుకోవాల్సిన అవసరముంది. ఈ రికార్డే తర్వాత నలువైపులా మోగుతుంది. గౌరవము ఇవ్వండి మరియు గౌరవము తీసుకోండి, చిన్నవారికి కూడా గౌరవము ఇవ్వండి, పెద్దవారికి కూడా గౌరవము ఇవ్వండి. గౌరవము ఇచ్చే రికార్డ్ ఇప్పుడు వెలువడాలి, అప్పుడు సంతోషమనే దానాన్ని ఇచ్చే మహాదానీ పుణ్య ఆత్మగా అవుతారు. ఎవరికైనా గౌరవాన్ని ఇచ్చి వారిని సంతోషపరచటము- ఇది అన్నింటికన్నా పెద్ద పుణ్య కార్యము, సేవ.

**స్లోగన్:- ప్రతి ఘడియను అంతిమ ఘడియగా భావిస్తూ నడుచుకున్నట్లయితే ఎవర్రెడీగా ఉంటారు.**

**<u>అవ్యక్త ప్రేరణలు</u>**

**నిశ్చయమనే పునాదిని దృఢముగా చేసుకుని సదా నిర్భయులుగా, నిశ్చింతగా ఉండండి**

ఏ విధముగా జ్ఞానమనే సబ్జెక్ట్ ఉందో, అదే విధముగా సేవ అనే సబ్జెక్ట్ కూడా ఉంది, ఎవరైతే ఇందులో విశ్వాసపాత్రులుగా, నిశ్చయబుద్ధి కలవారిగా ఉంటారో వారే ముందు నంబరులోకి వెళ్ళగలరు. ఉదయము నుండి రాత్రి వరకు మీ ప్రోగ్రామ్‌ను ఫిక్స్ చేసుకుని, రోజు డైరీని తయారుచేసుకోండి ఎందుకంటే మీరు బాధ్యత కల ఆత్మలు, సాధారణమైనవారు కారు, మీరు విశ్వ కళ్యాణకారీ ఆత్మలు. ఎవరెంత పెద్ద వ్యక్తులైతే వారి దినచర్య అంతగానే సెట్ అయి ఉంటుంది.

11-03-26 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

**"మధురమైన పిల్లలూ - స్మృతియాత్రలో రేస్ చేసినట్లయితే పుణ్యాత్మగా అయిపోతారు, స్వర్గ రాజ్యాధికారము లభిస్తుంది"**

**ప్రశ్న:-** బ్రాహ్మణ జీవితములో ఒకవేళ అతీంద్రియ సుఖము అనుభవమవ్వకపోతే ఏమని భావించాలి?

**జవాబు:-** తప్పకుండా సూక్ష్మముగా అయినా సరే ఏదో ఒక పాపము జరుగుతుందని భావించాలి. దేహాభిమానములో ఉన్నట్లయితేనే పాపాలు జరుగుతాయి, దాని కారణముగా ఆ సుఖపు అనుభూతిని పొందలేరు. తమను తాము గోప-గోపికలుగా భావిస్తున్నా సరే అతీంద్రియ సుఖపు అనుభూతి కలగటము లేదంటే, తప్పకుండా ఏదో తప్పు జరుగుతూ ఉంది, అందుకే తండ్రికి సత్యము చెప్పి శ్రీమతము తీసుకుంటూ ఉండండి.

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. గమ్యము చాలా ఉన్నతమైనది, అందుకే అడుగడుగులోనూ సర్జన్ నుండి సలహాను తీసుకోవాలి. శ్రీమతముపై నడవడములోనే లాభముంది, తండ్రి నుండి ఏదీ దాచి పెట్టకూడదు.
2. దేహము మరియు దేహధారుల నుండి బుద్ధియోగాన్ని తొలగించి ఒక్క తండ్రితో జోడించాలి. కర్మలు చేస్తూ కూడా ఒక్క తండ్రి స్మృతిలో ఉండే పురుషార్థము చేయాలి.

**వరదానము:- సదా ఏకరసమైన సంపన్న మూడ్‌లో ఉండే పురుషార్థీ సో ప్రారబ్ధీ స్వరూప భవ**

బాప్‌దాదా వతనము నుండి చూస్తూ ఉంటారు, కొంతమంది పిల్లల మూడ్ చాలా మారుతూ ఉంటుంది. ఒక్కోసారి ఆశ్చర్యకరమైన మూడ్, ఒక్కోసారి ప్రశ్నార్థక మూడ్, ఒక్కోసారి తికమకపడే మూడ్, ఒక్కోసారి టెన్షన్, ఒక్కోసారి అటెన్షన్ అనే ఊయలు... కానీ సంగమయుగము ప్రారబ్ధపు యుగము, అంతేకానీ పురుషార్థపు యుగము కాదు. అందుకే తండ్రి గుణాలు ఏవైతే ఉన్నాయో అవే పిల్లల గుణాలు, తండ్రి స్టేజ్ ఏదైతే ఉందో అదే పిల్లలది - ఇదే సంగమయుగపు ప్రారబ్ధము. కావున సదా ఏకరసమైన, సంపన్నమైన ఒకే మూడ్‌లో ఉండండి, అప్పుడు తండ్రి సమానమైనవారు అనగా ప్రారబ్ధ స్వరూపము కలవారు అని అంటారు.

**స్లోగన్:- బాప్‌దాదా చేతిలో బుద్ధి రూపీ చెయ్యి ఉన్నట్లయితే పరీక్షల రూపీ సాగరములో కదిలిపోరు.**

**<u>అవ్యక్త ప్రేరణలు</u>**

**నిశ్చయమనే పునాదిని దృఢముగా చేసుకుని సదా నిర్భయులుగా, నిశ్చింతగా ఉండండి**

విశ్వాసపాత్రుల మొదటి గుర్తు ఏమిటంటే - ప్రతి క్షణము, ప్రతి అడుగు శ్రీమతముపై ఏక్యురేట్ గా నడుచుకోవడము. ఏక్యురేట్ మూర్తిగా అవ్వడము అనగా ఉలిదెబ్బలు పడటము వంటిది. ఉలిదెబ్బలు వేసి-వేసి మూర్తిని సరి చేస్తారు. మీరైతే ఉలిదెబ్బలు తినటములో అనుభవజ్ఞులుగా అయిపోయారు, నథింగ్ న్యూ (కొత్తేమీ కాదు). ఆటలా అనిపిస్తుంది కదా. చూస్తూ ఉంటారు మరియు చిరునవ్వుతో ఉంటారు, ఆశీర్వాదాలు ఇస్తూ ఉంటారు. హీరో యాక్టర్ అనగా ఏక్యురేట్ పాత్రను అభినయించే నిశ్చయబుద్ధి నిశ్చింత ఆత్మ.

12-03-26 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

**"మధురమైన పిల్లలూ - ఈ చదువు సంపాదనకు ఆధారము, దీని ద్వారా మీరు మనుష్యుల నుండి దేవతలుగా అవుతారు, 21 జన్మల కొరకు సత్యమైన సంపాదన జరుగుతుంది"**

**ప్రశ్న:-** బాబా ఏవైతే మధురాతి మధురమైన విషయాలను వినిపిస్తారో, అవి ఎప్పుడు ధారణ అవుతాయి?

**జవాబు:-** ఎప్పుడైతే బుద్ధిపై పరమతము లేక మన్మతము యొక్క ప్రభావముండదో, అప్పుడు ధారణ అవుతాయి. ఏ పిల్లలైతే చెప్పుడు మాటలపై నడుచుకుంటారో, వారి బుద్ధిలో ధారణ జరగదు. ఎవరైనా జ్ఞానము కాకుండా వేరే ఏవైనా విషయాలను వినిపిస్తే వారు శత్రువు వంటివారు. అసత్యమైన మాటలను వినిపించేవారు చాలామంది ఉన్నారు, అందుకే చెడు వినకండి, చెడు చూడకండి, మనుష్యుల నుండి దేవతలుగా అయ్యేందుకు ఒక్క తండ్రి శ్రీమతముపైనే నడుచుకోవాలి.

**పాట:- మా తీర్థము అతీతమైనది...**

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. ఇక్కడ తండ్రి సమానముగా సుఖసాగరులుగా, ప్రేమసాగరులుగా అవ్వాలి. సర్వ గుణాలను ధారణ చేయాలి. ఎవరికీ దుఃఖాన్ని ఇవ్వకూడదు.
2. చెప్పుడు మాటలను ఎప్పుడూ నమ్మకూడదు, పరమతాన్ని అనుసరించకూడదు. చెడు వినకండి, చెడు చూడకండి...

**వరదానము:- నేను అనే భావన యొక్క భారాన్ని సమాప్తము చేసి ప్రత్యక్ష ఫలాన్ని అనుభవము చేసే బాలకుల నుండి యజమానులుగా కండి**

ఏ విధమైన నేను అన్న భావన వచ్చినా కానీ భారము తల పైకి ఎక్కుతుంది. కానీ - మీ అన్ని భారాలను నాకు ఇచ్చేయండి, మీరు కేవలము నాట్యము చేయండి, ఎగరండి... అని బాబా ఆఫర్ చేస్తున్నప్పుడు, మరి - సేవ ఎలా జరుగుతుంది, భాషణ ఎలా చేస్తాము అనేటువంటి ప్రశ్నలు ఎందుకు? మీరు స్వయాన్ని కేవలం నిమిత్తముగా భావిస్తూ కనెక్షన్‌ను పవర్ హౌస్‌తో జోడించి కూర్చోండి, నిరాశకు, దుఃఖానికి లోనవ్వకండి, అప్పుడు బాప్‌దాదా స్వతహాగా అంతా చేయించేస్తారు. బాలకుల నుండి యజమానులుగా అవుతాము అని భావిస్తూ శ్రేష్ఠమైన స్టేజ్‌పై స్థితులై ఉండండి, అప్పుడు ప్రత్యక్షఫలము యొక్క అనుభూతిని చేస్తూ ఉంటారు.

**స్లోగన్:- జ్ఞాన దానముతో పాటుగా గుణ దానము చేయండి, అప్పుడు సఫలత లభిస్తూ ఉంటుంది.**

## అవ్యక్త ప్రేరణలు

**నిశ్చయమనే పునాదిని దృఢముగా చేసుకుని సదా నిర్భయులుగా, నిశ్చింతగా ఉండండి**

ఎటువంటి కఠినమైన పరిస్థితి అయినా కానీ దానిని ఆటగా భావించటము ద్వారా కఠినమైన సమస్య కూడా తేలికగా అయిపోతుంది. కొంతమంది పిల్లలలో ధైర్యము ఉంది, అందుకే ఏ విషయము జరిగినా కానీ - సరే చేస్తాము, ఆలోచిస్తాము అని అంటారు. ధైర్యమైతే ఉంది, కానీ నమ్మకము లేదు. నమ్మకము ఉన్నవారి మాటలు ఇలా ఉండవు. నమ్మకము ఉంది అంటే అర్థము - మనసా, వాచా, కర్మణా, ప్రతి విషయములోనూ నిశ్చయబుద్ధి కలిగి ఉండటము, వారి నోటి నుండి ఎప్పుడూ ధైర్యహీనులుగా చేసే మాటలు వెలువడవు.

13-03-26 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

**"మధురమైన పిల్లలూ - మీరు శ్రీమతమనుసారముగా తత్వాల సహితముగా ప్రపంచమంతటినీ పావనముగా తయారుచేసే సేవను చేయాలి, అందరికీ సుఖము మరియు శాంతి యొక్క మార్గాన్ని తెలియజేయాలి"**

**ప్రశ్న:-** పిల్లలైన మీరు మీ దేహాన్ని కూడా మర్చిపోయే పురుషార్థము చేస్తారు, అందుకే మీకు ఏ వస్తువు యొక్క అవసరము లేదు?

**జవాబు:-** చిత్రాల అవసరము లేదు. ఈ చిత్రాన్నే (దేహాన్నే) మర్చిపోవాలి అన్నప్పుడు ఇక ఆ చిత్రాల అవసరమేముంది. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ విదేహీ తండ్రిని మరియు మధురమైన ఇంటిని స్మృతి చేయండి. ఈ చిత్రాలైతే చిన్న పిల్లల కోసము అనగా కొత్తవారి కోసము ఉన్నాయి. మీరైతే స్మృతిలో ఉండాలి మరియు అందరి చేత స్మృతి చేయించాలి. వ్యాపారాలు మొదలైనవి చేసుకుంటూ సతోప్రధానముగా అయ్యేందుకు స్మృతిలోనే ఉండే అభ్యాసము చేయండి.

**పాట:- భాగ్యాన్ని మేలుకొలుపుకుని వచ్చాను...**

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. తండ్రి సమానముగా మహిమా యోగ్యులుగా అయ్యేందుకు ఫాలో ఫాదర్ చేయాలి.
2. ఇది అంతిమ జన్మ, ఇప్పుడు ఇంటికి వెళ్ళాలి, అందుకే సంతోషములో లోలోపలే భజంత్రీలు మోగుతూ ఉండాలి. కర్మభోగాన్ని కర్మయోగముతో అనగా తండ్రి స్మృతితో చాలా సంతోషముగా సమాప్తము చేసుకోవాలి.

**వరదానము:- బాలకుల నుండి యజమానులుగా అవుతాము అన్న స్మృతి ద్వారా సర్వ ఖజానాలకు అధికారి, ప్రాప్తి సంపన్న భవ**

మనము తండ్రి యొక్క సర్వ ఖజానాలకు బాలకులము మరియు యజమానులము, సహజ యోగులము, సహజ స్వరాజ్య అధికారులము. ఈ స్మృతి ద్వారా సర్వ ప్రాప్తి సంపన్నులుగా అవ్వండి. "పొందాల్సినదేదో పొందేసాను" అన్న ఈ పాటనే సదా పాడుతూ ఉండండి. పోగొట్టుకున్నాను, పొందాను, పోగొట్టుకున్నాను, పొందాను... అన్న ఈ ఆటను ఆడుతూ ఉండకండి. పొందుతూ ఉన్నాను, పొందుతూ ఉన్నాను - ఇవి అధికారుల మాటలు కావు. ఎవరైతే సంపన్నమైన తండ్రి పిల్లలో, సాగరుని పిల్లలో వారు నౌకర్లలాగా శ్రమ చేయలేరు.

**స్లోగన్:- యోగబలము ద్వారా కర్మభోగముపై విజయాన్ని ప్రాప్తి చేసుకోవటము - ఇదే శ్రేష్ఠ పురుషార్థము.**

**<u>అవ్యక్త ప్రేరణలు</u>**

**నిశ్చయమనే పునాదిని దృఢముగా చేసుకుని సదా నిర్భయులుగా, నిశ్చింతగా ఉండండి**

అన్నింటికంటే ముందు స్వయం పట్ల పూర్తి విశ్వాసము ఉండాలి, ఆ తర్వాత బాప్‌దాదా మరియు పూర్తి పరివారములోని ఆత్మల పట్ల విశ్వాసము కలిగి ఉండాలి. ఎంతగా విశ్వాసపాత్రులుగా ఉంటూ నిశ్చయబుద్ధి కలవారిగా అయ్యి ఏదైనా కర్తవ్యాన్ని చేస్తారో, విశ్వాసపాత్రులుగా ఉన్న కారణముగా సక్సెస్‌ఫుల్‌గా (సఫలతామూర్తులుగా) అవ్వనే అవుతారు. విశ్వాసపాత్రులుగా ఉన్న కారణముగా ప్రతి కర్తవ్యము, ప్రతి సంకల్పము, ప్రతి మాట పవర్‌ఫుల్‌గా (శక్తిశాలిగా) ఉంటుంది.

14-03-26 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

**"మధురమైన పిల్లలూ - ఒక్క తండ్రియే నంబరు వన్ పాత్రధారి, వారు పతితులను పావనముగా తయారుచేసే పాత్రను అభినయిస్తారు, తండ్రి వంటి పాత్రను ఎవ్వరూ అభినయించలేరు"**

**ప్రశ్న:-** సన్యాసుల యోగము భౌతిక యోగము, ఆత్మిక యోగాన్ని తండ్రి మాత్రమే నేర్పిస్తారు, ఎలా?

**జవాబు:-** సన్యాసులు బ్రహ్మతత్వముతో యోగము జోడించడము నేర్పిస్తారు. కానీ అది నివసించే స్థానము. కావున అది భౌతిక యోగము అవుతుంది. తత్వాన్ని సుప్రీమ్ అని అనరు. పిల్లలైన మీరు సుప్రీమ్ ఆత్మతో యోగము జోడిస్తారు, అందుకే మీ యోగము ఆత్మిక యోగము. ఈ యోగాన్ని తండ్రి మాత్రమే నేర్పించగలరు, ఇంకెవ్వరూ నేర్పించలేరు ఎందుకంటే వారే మీ ఆత్మిక తండ్రి.

**పాట:- నీవు ప్రేమ సాగరుడవు...**

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. సత్యాతి–సత్యమైన ప్రేయసులుగా అయి, చేతులతో పని చేస్తూ బుద్ధి ద్వారా ప్రియుడిని స్మృతి చేసే అభ్యాసము చేయాలి. తండ్రి స్మృతి ద్వారా మనము స్వర్గవాసులుగా అవుతున్నాము, ఈ సంతోషములో ఉండాలి.
2. సూర్యవంశీ రాజ్యములో సింహాసనాధికారులుగా అయ్యేందుకు తల్లిదండ్రులను పూర్తిగా ఫాలో చేయాలి. తండ్రి సమానముగా నాలెడ్జ్‌ఫుల్‌గా అయి అందరికీ మార్గాన్ని తెలియజేయాలి.

**వరదానము:- కిరీటాన్ని మరియు తిలకాన్ని ధారణ చేసి బాప్‌దాదాకు సహాయకులుగా అయ్యే హృదయ సింహాసనాధికారి భవ**

ఎప్పుడైనా, ఎవరైనా సింహాసనముపై కూర్చుంటే తిలకము మరియు కిరీటము వారికి గుర్తుగా ఉంటుంది. అలా ఎవరైతే హృదయ సింహాసనాధికారులుగా ఉంటారో వారి మస్తకముపై సదా అవినాశీ ఆత్మ యొక్క స్థితి రూపీ తిలకము దూరము నుండే ప్రకాశిస్తూ కనిపిస్తుంది. సర్వాత్మల పట్ల కళ్యాణము యొక్క శుభ భావన వారి నయనాల ద్వారా మరియు ముఖము ద్వారా కనిపిస్తుంది. వారి ప్రతి సంకల్పము, మాట మరియు కర్మ బాబా సమానముగా ఉంటుంది.

**స్లోగన్:- సరళమైన స్మృతి కొరకు సరళతా గుణాన్ని ధారణ చేయండి, సంస్కారాలను సరళముగా చేసుకోండి.**

**<u>అవ్యక్త ప్రేరణలు</u>**

**నిశ్చయమనే పునాదిని దృఢముగా చేసుకుని సదా నిర్భయులుగా, నిశ్చింతగా ఉండండి**

విజయులుగా అయ్యేందుకు పునాది – "నిశ్చయము", ఒకవేళ పునాది పక్కాగా ఉన్నట్లయితే బిల్డింగ్ కదలదు, నిశ్చింతగా ఉంటారు. కానీ కేవలము తండ్రి పట్ల నిశ్చయము ఉండటము కాదు, స్వయముపై కూడా నిశ్చయము మరియు డ్రామాపై కూడా నిశ్చయము ఉండాలి. వాహ్ డ్రామా వాహ్! ఒకవేళ డ్రామాపై నిశ్చయము ఉన్నట్లయితే అకళ్యాణ విషయము కూడా కళ్యాణములోకి మారిపోతుంది.

15-03-26 ప్రాతః మురళి ఓంశాంతి "అవ్యక్తబాప్‌దాదా" రివైజ్-24-03-2009 మధువనం

**"బాప్‌దాదా ద్వారా లభించిన ఖజానాలను స్వయములో నింపుకుని కార్యములో వినియోగించండి, అనుభవము యొక్క అథారిటీలుగా అవ్వండి"**

- ఈ రోజు నలువైపులా ఉన్న సర్వ ఖజానాలను జమ చేసుకునే సంపన్నులైన పిల్లలను చూస్తున్నారు. అన్నిటికంటే ముందుగా అత్యంత పెద్ద ఖజానా జ్ఞాన ధనము, దాని ద్వారా ముక్తి మరియు జీవన్ముక్తి ప్రాప్తించాయి. అలాగే, యోగము కూడా ఖజానాయే, దీని ద్వారా సర్వ శక్తుల ప్రాప్తి లభిస్తుంది. ధారణ చేసే ఖజానా, దీని ద్వారా సర్వ గుణాల ప్రాప్తి లభిస్తుంది. సేవా ఖజానా, దీని ద్వారా ఆశీర్వాదాల ఖజానా, సంతోషపు ఖజానా ప్రాప్తిస్తాయి. అన్నిటికంటే అత్యంత పెద్ద ఖజానా వర్తమాన సంగమయుగము యొక్క సమయము ఎందుకంటే పూర్తి కల్పములో ఈ సంగమ సమయము అమూల్యమైన ఖజానా.
- ఖజానాలను ధారణ చేయడానికి - ఒకటి, తమ పురుషార్థముతో ప్రారబ్ధాన్ని తయారుచేసుకోవచ్చు, రెండవది, సదా స్వయము సంతుష్టముగా ఉండండి మరియు సర్వులను సంతుష్టపరచండి మరియు మూడవది, సేవ ద్వారా సంతోషపు ఖజానాను ప్రాప్తి చేసుకోవచ్చు.
- ఖజానాలను జమ చేసుకోవడములో విశేషముగా సంబంధ-సంపర్కాలలోకి వచ్చేటప్పుడు, ఒకటి నిమిత్త భావము, నిర్మాన భావము, నిస్వార్థ భావము, ప్రతి ఆత్మ పట్ల శుభ భావనను మరియు శుభ కామనను ఉంచవలసిన అవసరముంది. పుణ్య ఖాతాను మరియు ఆశీర్వాదాల ఖాతాను చాలా సహజముగా జమ చేసుకోగలరు.
- బాబా ఖజానాలను మీ ఖజానాలుగా చేసుకోవాలి ఎందుకంటే ఎంతగా ఖజానాలు నిండుగా ఉంటాయో అంతగా నిండుదనముతో కూడిన అవస్థలో అచలముగా, స్థిరముగా ఉంటారు. ఎవరి భండారా ఎంత నిండుగా ఉంది అనేది వారి నయనాల ద్వారా ఆత్మికత, ముఖము ద్వారా చిరునవ్వు మరియు కర్మ ద్వారా ప్రతి గుణము అందరికీ అనుభవమవుతాయి!

**వరదానము:- మాస్టర్ త్రికాలదర్శులుగా అయ్యి ప్రతి కర్మను యుక్తియుక్తముగా చేసే కర్మబంధన ముక్త భవ**

ఏ సంకల్పము, మాట మరియు కర్మను చేసినా - దానిని మాస్టర్ త్రికాలదర్శులుగా అయ్యి చేసినట్లయితే ఏ కర్మ కూడా వ్యర్థముగా లేక అనర్థముగా అవ్వదు. త్రికాలదర్శిగా అయ్యి అనగా సాక్షీతనపు స్థితిలో స్థితులై, కర్మల గుహ్యగతిని తెలుసుకుని ఈ కర్మేంద్రియాల ద్వారా కర్మలు చేయించినట్లయితే ఎప్పుడూ కూడా కర్మబంధనములో బంధింపబడరు. ప్రతి కర్మను చేస్తూ కర్మబంధన ముక్తులుగా, కర్మాతీత స్థితిని అనుభవము చేస్తూ ఉంటారు.

**స్లోగన్:- ఎవరి వద్దనైతే హద్దు కోరికల అవిద్య ఉంటుందో వారే మహాన్ ధనవంతులు.**

**<u>అవ్యక్త ప్రేరణలు</u>**

**నిశ్చయమనే పునాదిని దృఢముగా చేసుకుని సదా నిర్భయులుగా, నిశ్చింతగా ఉండండి**

కాపలా కాసే కాపలాదారుడు ఒకవేళ శస్త్రధారిగా ఉన్నట్లయితే మరియు అతనికి - నా శస్త్రము శత్రువులను పారద్రోలేది, వారిని ఓడింపజేసేది అన్న నిశ్చయము ఉన్నట్లయితే, వారు ఎంత నిర్భయతతో నడుచుకుంటారు. మరి మీ వద్ద కూడా సర్వ శక్తుల రూపీ శస్త్రాలు సదా తోడుగా ఉన్నాయి, కేవలము వాటిని ఆహ్వానించండి అనగా యజమానిగా అయ్యి ఆజ్ఞాపించండి, అప్పుడు సఫలత సదా లభించే ఉంది.